వచ్చాయి. నావి చూడు. సూటిగా, ఎటూ వెళ్ళకుండా సరాసరి నా గమ్యానికి చేరుకున్నాయి. ప్రపంచంలో మనకి తారసపడే ఆకర్షణీయమైన వాటి వైపు పోకుండా, మనసుని దైవం మీదే లగ్నం చేసి సాధన చేసుకుంటూ పోతే, అదే దగ్గర దారి అవుతుంది." వివరించాడు ఆ సాధువు.

## 27. గురువు గారి గడియారం

ఉత్తరాంచల్‌లోని ఓ సత్రంలో ఓ సన్న్యాసి బస చేసాడు. చలి ప్రదేశం కాబట్టి ఆ సత్రం నేల మీద చెక్కలు పరిచారు. ఆ రాత్రంతా ఆ సన్న్యాసి పై గదిలో అటు ఇటు పచార్లు చేస్తూండటంతో చెక్క నేల మీద చప్పుడు అవసాగింది. సరిగ్గా దాని కింది గదిలో పడుకున్న సత్రం యజమానికి ఆ అడుగుల చప్పుడికి రాత్రంతా నిద్ర పట్టలేదు. మర్నాడు యజమాని ఆ సన్న్యాసిని అడిగాడు.

"ఎందుకలా రాత్రంతా నిద్ర లేకుండా నడిచారు?"

"ముందు మీరు దీనికి సమాధానం చెప్పండి. ఆ గదిలోని గోడ గడియారం మీకు ఎక్కడిది?" ప్రశ్నించాడు ఆ సన్న్యాసి.

"నా ప్రశ్నకీ దీనికి ఏమిటి సంబంధం?" అడిగాడు ఆ సత్రం యజమాని.

"ఆ గడియారం నా గురువుదై ఉండాలని నా నమ్మకం. అందుకే నిద్ర పట్టక తిరిగాను."

"తన తండ్రి మరణానంతరం సుబోధ్ అనే అతను దాన్ని నాకు అమ్మాడు."

"అంటే నా గురువు కొడుకు సుబోధ్ దాన్ని మీకు అమ్మాడన్నమాట."

"మీరు ఆ గడియారాన్ని ఎలా గుర్తుపట్టగలిగారు?" సత్రం యజమాని ఆశ్చర్యంగా అడిగాడు.

"అన్ని గడియారాలు తమ యజమానులకి భోగాల మీద గల మమకారం వల్ల కాలం గడిచే కొద్దీ, వారు వాటికి దూరం అవుతున్నారన్న బాధతో అవి 'ఓ క్షణం దూరం అయాం, ఓ క్షణం దూరం అయాం' అని శబ్దం చేస్తూంటాయి. సమయం గడిచే కొద్దీ మన కర్మలు ప్రారబ్ధ రూపంలో కరిగి మనం దైవ సాక్షాత్కారానికి దగ్గరవుతున్నాం అని మా గురువు చెప్తూండేవారు. అందువల్ల నా

గురువు గడియారం మాత్రం 'దగ్గరకి వచ్చేసాం, దగ్గరకి వచ్చేసాం' అని శబ్దం చేస్తుంది. అందుకనే ఆ గడియారం మా గురువు గారిదని గుర్తించ గలిగాను." వివరించాడు ఆ సన్యాసి.

## 28. పరికరాలం మాత్రమే

ఓ హరిదాసు శ్రీమత్ భాగవతంలోని జడ భరతుడి కథ చెప్తున్నాడు.

"నిండు గర్భవతి అయిన ఓ ఆడ లేడి ఓ వాగులోని నీటిని తాగబోతూండగా, అక్కడికి వచ్చిన పులిని చూసి భయంతో ఆ వాగు మీంచి అవతలి గట్టుకి దూకబోయి కిందపడింది. ఆ తాకిడికి అది మరణించింది. దాని పిల్ల వెంటనే గర్భంలోంచి సురక్షితంగా బయటకి వచ్చింది.

"పుట్టుకతోనే తల్లిని కోల్పోయిన దాన్ని చూసి భరతుడు జాలిపడి తన వెంట ఆశ్రమానికి తీసుకెళ్ళి దాని బాగోగులని చూసుకోసాగాడు. దాని మీద అతనికి ప్రేమ ఎంతగా ముదిరిందంటే, తన మరణకాలంలో ఆఖరి క్షణంలో అతనికి 'తను లేకపోతే ఆ లేడి పిల్లని ఎవరు చూస్తారా' అన్న ఆలోచన వచ్చి, అదే గుర్తుకు వచ్చింది. దాంతో అతనికి ముక్తి బదులు లేడి జన్మ వచ్చింది. కాబట్టి మనం దేన్ని అధికంగా ప్రేమించినా ప్రాణం పోయేప్పుడు అదే స్మరణకి వచ్చి ముక్తికి అడ్డు పడుతుంది."

దారిన పోయే ఓ మహాత్ముడు ఆ కథని విని, చివర్లో హరిదాసు ముగింపుగా చెప్పిన వాక్యాలకి పెద్దగా నవ్వాడు.

శ్రోతల్లో ఒకరు వెంటనే లేచి ఆయనకి నమస్కరించి వినయంగా అడిగాడు.

"హరిదాసు చెప్పిందాంట్లో మీకేం తప్పు కనిపించింది? లేకపోతే మీరలా నవ్వి వుండేవారు కాదు. దయతో మాకు వివరించండి."

ఆ మహాత్ముడు అంతా వినేలా చెప్పాడు.

"ఈ కథని ఇలా విన్నవాడు ఎన్నడూ ఆపదలో వున్న ఎవరికీ సహాయం చేయకూడదు అని భ్రమించే అవకాశం వుంది. భరతుడు చేసిన పొరబాటు నిజానికి ఆ లేడి పిల్లని ప్రేమించడం కాదు. దేవుడ్ని విస్మరించడం. తన ద్వారా దేవుడు ఆ